కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మండల పరిధిలోని పలువురు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లతో పేదింటి ఆడబిడ్డలకు వరం లాంటిదన్నారు. తహసీల్దార్ రాములు, కార్పొరేటర్లు శాంతి, సబిత, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, మురుగేష్, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



మల్కాజిగిరి: అనంతసరస్వతీనగర్‌లో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ అసోషియేషన్ సభ్యులు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. రోడ్లు దెబ్బతిన్నాయని వాటి స్థానంలో నూతన సీసీరోడ్ల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు, తాగునీటి సరఫరాలో సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ప్రభాకర్‌గౌడ్, యాదగిరి, సత్తయ్యగౌడ్, ఇంద్రసేనారెడ్డి, మల్లేష్, మల్లికార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు, హైజనిక్ కిట్ల పంపిణీ



ఉప్పల్: ఎస్అండ్‌పీ గ్లోబల్ ఫౌండేషన్ అండ్ స్మైల్ ఆల్వేస్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఉప్పల్ నాలా పక్కన నివాసం ఉండే బస్తీవాసులకు టార్పాలిన్లు, హైజనిస్ కిట్లను అందజేశారు. రాష్ట్రంలో గతవారం రోజులుగా కురిసిన వర్షాలకు నిరుపేద కుటుంబాలను అతలాకుతలమయ్యాయి. దాదాపుగా 50 కుటుంబాలకు ఉచితంగా టార్పాలిన్లు, హెల్త్‌కిట్లను అందజేశారు. అభిషేక్ సింఘాల్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



సత్యదేవుని ఆలయంలో బారులు తీరిన భక్తులు

రామంతాపూర్ : ఇందిరానగర్ సత్యదేవుని ఆలయం రాజేంద్రనగర్ నాగ దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం భారీఎత్తున ఆలయాలకు చేరుకుని పుట్టలో పాలు పోసి నాగ దేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ శ్రీవాణి పలు నాగ దేవత ఆలయాలను సందర్శించారు. సత్యదేవుని ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు మాట్లాడుతూ.. నాగ పంచమి నాడు పుట్టలకు పాలు పోయడం పూజలు చేయడం వంటివి చేస్తే వంశాభివృద్ధి కలుగుతుందని ఆలయాల్లో నాగదేవతకు అష్టోత్తరములు పంచామృతములతో అభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. న్యూ మిర్జాలగూడలోని వెంకటాద్రినగర్‌లోని కట్టమైసమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ మేకల సునీత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు మేకల రాముయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు దేవరాజన్, విజయకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో అవస్థలు !



ప్రధాన రహదారి పక్కన నిలిపిన వాహనాలు

ఇష్టానుసారంగా అక్రమ పార్కింగ్

- పెరిగిన జనాభాకు అనుగుణంగా లేని రహదారులు
- ఇబ్బందిపడుతున్న పాదచారులు, వాహనదారులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. గడిచిన పదేళ్ల నుంచి పెరిగిన జనాభాకు అనుగుణంగా రహదారులను విస్తరించలేదు. దీనికితోడు ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో షాపులకు వచ్చే వాహనదారులు రోడ్డుపైనే అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు, వాహదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అక్రమ పార్కింగ్‌ను అరికట్టాల్సిన ఇటు మున్సిపల్ అధికారులు, అటు ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరుగుతున్న జనాభా.. కుంచించుకుపోతున్న రహదారులు

బోడుప్పల్‌లో గడిచిన పదేళ్లలో అప్పటితో పోలిస్తే జనాభా 10 రెట్లు పెరిగింది. దీనికనుగుణంగా ప్రధాన రహదారుల విస్తరణ జరగలేదు. దీనికితోడు వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. పెరిగిన వాహనాలకు అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు సరైన రహదారులు లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నారు.

రోడ్లపై అక్రమ పార్కింగ్

ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఇరువైపుల వ్యాపార సముదాయాలు ఉన్నాయి. సదరు వ్యాపార సముదాయాలకు ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేదు. షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేసి షాపింగ్ చేయడం, వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. అప్పటి వరకు సదరు వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

పెరిగిన వాహనాల రద్దీ

ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు స్కైవే పనులు జరుగుతున్నాయి. ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలు వయా బోడుప్పల్ మీదుగా మల్లాపూర్, ఉప్పల్, నాచారం వైపు వెళ్తున్నాయి. దీంతో బోడుప్పల్‌లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది.

ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలు

అంబేడ్కర్ విగ్రహం నుంచి నగర పాలక సంస్థకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉంది. దీనికితోడు రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిలోని సీఎస్ఆర్ షాపు పక్కన ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ వల్ల ఉదయం, సాయం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. బోడుప్పల్ ప్రధాన రహదారిలో పాత వాటర్ ట్యాంక్ వద్ద, చిలుకానగర్ వెళ్లేదారిలో ఉన్న న్యారో బ్రిడ్జ్ వద్ద, చెంగిచర్లలోని చింతల చెరువు వద్ద వైన్‌షాపులు ఉన్నాయి. అక్కడకు వచ్చే వారు రోడ్డు పక్కనే అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధాన రహదారిలో ఉన్న హాస్పిటల్స్, బ్యాంక్‌ల వద్ద రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు.

జరిమానా విధించాలి



పార్కింగ్ సౌకర్యం లేని వ్యాపార సముదాయాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అక్రమంగా పార్క్ చేసే వాహనదారులకు జరిమానా విధించాలి. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు దీనిపై చొరవ తీసుకుని అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలి. ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

– రచ్చ కిషన్, బోడుప్పల్

తగిన చర్యలు తీసుకుంటాం



అక్రమంగా పార్కింగ్ చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. పార్కింగ్ సౌకర్యం లేని వ్యాపార సముదాయాలకు నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శైలజ, కమిషనర్ బోడుప్పల్

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.18 కోట్ల నిధులు



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ శాంతి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో స్థానిక కాలనీవాసులు

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తన సొంత నిధుల నుంచి రూ.18 కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించి ప్రొసీడింగ్స్‌ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ అందజేశారు. గత నెల ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ఎంపీ ఈటల స్పందించి తన నిధుల నుంచి సుమారు రూ.20 కోట్లతో నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు.

◆ నియోజకవర్గంలోని 10 డివిజన్లలో సీసీరోడ్ల నిర్మాణాలు అవసరం ఉన్న కాలనీలను గుర్తించి సిద్ధం చేసిన నివేదికలను ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అందజేశారు. సహకరించిన జీహెచ్ఎంసీ కమిషనర్, ఎల్‌బీనగర్ జెడ్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమీషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే..

మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని పలు సమస్యలు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంగళవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. వార్డు కార్యాలయానికి లిఫ్ట్, హిందూ శ్మశానవాటిక, బాబానగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధి రైతుబజార్‌లో మల్టిపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం, వీఎస్టీ కాలనీలో రూ.20లతో సీసీరోడ్డు, పటేల్‌కుంట చెరువు సుందరీకరణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ తదితరులున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే చర్యలు తప్పవు..

రామంతాపూర్ : భగాయత్ వెంకట్‌సాయినగర్ కాలనీ బీరప్ప దేవాలయం వెనుక ఆలయంలో మంజూరైన బాక్స్ కల్వర్ట్‌ను కొంతమంది అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వెంకటసాయి కాలనీవాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంగళవారం మాట్లాడుతూ.. బస్తీ, కాలనీలో వివిధ రాజకీయ పార్టీలు ఉండటం సహజమేనని, అభివృద్ధి కోసం అన్ని పక్షాలు ఏకమై ఐక్యతతో కృషిచేయాల్సి ఉండగా.. అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే రామంతాపూర్ భగత్ కాలనీలకు రూ.కోటి నిధులు మంజూరు చేసి డ్రైనేజీ లైన్ పూర్తి చేయించామని చెప్పారు. మంజూరైన బాక్స్ కల్వర్టు పనులకు త్వరలో శంకుస్థాపన చేసి పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, సర్వ సత్తయ్య యాదవ్, గోపాల్ గోవింద్, విజయేందర్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, కీర్తిచారి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా పెండింగ్‌లోనే..!

- మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించని జీతాలు, బిల్లులు
- గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో కట్టెలపై వండుతున్న వైనం



ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో భోజనం వండుతున్న సిబ్బంది

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్ ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి సిద్ధం చేసి వడ్డించే మహిళా సమాఖ్యలకు చెందిన కార్మికులకు గత 5 నెలలుగా జీతాలతో పాటు మెస్ బిల్లులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో సబ్సిడీతో కూడిన వంటగ్యాస్ సిలిండర్‌లను స్థానికంగా ఉన్న డీలర్ల వద్ద నుంచి తామే కొనుగోలు చేసి పొగ లేకుండా వంటలు చేసే వారిమన్నారు. ప్రస్తుతం వంటగ్యాస్ సరఫరాను నిలిపేయడంతో కట్టెల పొయ్యిపై వంటలు చేయడంతో వచ్చే పొగతో తమతో పాటు విద్యార్థులు కూడా అనారోగ్యం పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుందని మిగతా కూరగాయాలు, గుడ్లు, నూనె, కట్టెలు, పప్పులు, ఉప్పులు అన్ని తామే వడ్డీకి అప్పులు తెచ్చి వండుతున్నామని వాపోయారు. వెంటనే ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు పట్టించుకుని పెండింగ్‌లో ఉన్న మెస్‌బిల్లులు, జీతాలు చెల్లించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆలయాల వద్ద ఫ్లెక్సీల నిషేధం !

బోడుప్పల్: శ్రావణ బోనాల సందర్భంగా బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు 100 మీటర్ల మేర నిషేధించినట్లు కమిషనర్ శైలజ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 3న బోనాలు, 4న పెద్ద పండగ జరగుతుందన్నారు. 100 మీటర్ల పరిధిలో అమ్మవారి ఆలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు, గుడి నుంచి జనిగె శ్రీరాములు ఇంటి వరకు, గుడి నుంచి బొమ్మక్ నర్సింగ్‌రావు ఫంక్షన్‌హాల్ వరకు, గుడి నుంచి సాయి ఎన్‌క్లేవ్ కమ్యూనిటీహాల్ వరకు ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లను అనుమతించడం లేదన్నారు. ఇట్టి ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆమె కోరారు.

చర్లపల్లి ఇన్‌స్పెక్టర్‌గా సుధాకర్



కుషాయిగూడ: చర్లపల్లి పోలీస్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా సుధాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రవికుమార్ ఆదిభట్లకు బదిలీకావడంతో ఆయన స్థానంలో సరూర్‌నగర్ ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహించిన సుధాకర్‌ను చర్లపల్లికి బదిలిచేస్తూ.. రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పహాడీషరీఫ్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన గురువారెడ్డిని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

వైశ్య సంఘం అధ్యక్షుడిగా వెంకట్ గుప్తా



రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా దారం వెంకటరాజు గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మేడ్చల్ జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య సంఘం అధ్యక్షుడు సంబు పాండయ్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సంఘం అభివృద్ధితో పాటు సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. వైశ్య సంఘం నేతలు భువనగిరి శ్రీనివాస్‌గుప్తా, నాగయ్య, రవీందర్, బిక్షపతి, కొత్తపల్లి రమేష్, ప్రకాష్, రామచంద్ర, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగి కన్నుమూత



లింగారెడ్డి(ఫైల్)

గౌతంనగర్: డివిజన్ జ్యోతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, రైల్వే విశ్రాంత ఉద్యోగి డాక్టర్ బహదూర్ లింగారెడ్డి సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన సాంస్కృతిక, సామాజిక సేవలో అపూర్వ సేవలందించి అనేక పతకాలు పొందారని, సమాజానికి విశేష కృషి చేశారన్నారు. లింగారెడ్డి మృతితో జ్యోతినగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అభివృద్ధి పనులు ప్రారంభం



రహదారి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి : డివిజన్ మారుతినగర్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీ ఈటల రాజేందర్ చొరవతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి నిర్మాణానికి ఇప్పటికీ మోక్షం కలిగిందన్నారు. ప్రగతినగర్, మారుతీనగర్, న్యూ మారుతీనగర్, క్రియేటివ్‌నగర్, శ్రామిక్‌నగర్, నెహ్రూనగర్, గణేష్‌నగర్, ఓల్డ్ సఫిల్‌గూడ, భరత్‌నగర్, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆయా కాలనీ సంక్షేమ కమిటీల ప్రతినిధులు కుమార్, దర్శిరెడ్డి, మల్లికార్జున్, సుధాకర్, శ్రీనివాస్, లోకనాథం, శంకర్, బీజేపీ నేతలు శివగౌడ్, సాయిబాబు , రామకృష్ణ, వెంకటేష్, కిరణ్, మహేష్, శ్రీనివాస్, రమణ, రేఖ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి రక్షణ కిట్ల పంపిణీ



శానిటేషన్ సిబ్బందికి కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: శానిటేషన్ సిబ్బందికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. మంగళవారం చిన్న చర్లపల్లి, కుషాయిగూడ వార్డు కార్యాలయాల్లో ఆమె సిబ్బందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధిగా రక్షణ పరికరాలను ధరించి కార్మికులు విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణతో పాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

◆ సీఎం రేవంత్‌రెడ్డి చొరవచూపి ఉప్పల్ నియోజకవర్గం, చర్లపల్లి డివిజన్‌కు నిధులు కేటాయించడంపై కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి డివిజన్‌కు అదనంగా రూ.1.80 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాండు, అశోక్, విశ్వనాథం , వినోద్, క్రాంతి పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల సర్వే !

వ్యతిరేకించిన స్థానికులు



నిరసనలో అంబేద్కర్‌నగర్ ఫేస్- 3 వాసులు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని 12, 13 డివిజన్ల పరిధిలోని అంబేద్కర్‌నగర్ ఫేస్– 3, గౌతమీనగర్ కాలనీల్లో మంగళవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అంబేద్కర్‌నగర్ ఫేస్– 3, గౌతమీనగర్ కాలనీల్లో నివాసం ఉండే పేద ప్రజలకు ప్రభుత్వం జీ ప్లస్ 2 కింద డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తుందని ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. వారిలో చాలామంది డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వ్యతిరేకించారు. ఈ సర్వేలో పాల్గొన్న మండల ఆర్ఐ చంద్రకళ, నగర పాలక సంస్థ జూనియర్ అసిస్టెంట్ కమలాకర్ ప్రజల నుంచి సేకరించిన సర్వే రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. 'తమ కాలనీల్లో మౌలికవసతులు కల్పించాలని, తమ ప్రాణాలైన వదులుతాం.. కానీ ఇక్కడి నుంచి ఖాళీ చేయమంటూ'.. నిరసన వ్యక్తం చేశారు.

తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి



బ్యాడ్జీలను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

మల్లాపూర్: విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ తమ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ సూచించారు. మంగళవారం నాచారం అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం హెడ్‌బాయ్, హెడ్ గర్ల్స్‌కు బ్యాడ్జీలను అందజేసి విద్యార్థులను ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ శివకుమార్, ప్రధానోపాధ్యాయురాలు నిషాత్‌అంజూమ్, ఎస్సై మైబెలి తదితరులున్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు



మల్కాజిగిరి: డివిజన్ పరిధిలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం బాలసరస్వతీనగర్‌లో సుమారు రూ.49 వేలతో ఇంకుడు గుంత ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో వర్షపు నీరు వృధా కాకుండా ముఖ్యమైన ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.11 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నీటిఎద్దడి ఎదుర్కొంటున్నామని, భవిష్యత్తరాలను దృష్టిలో ఉంచుకుని అవకాశం ఉన్న ప్రతి ఇంటి యజమాని ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, ఏఎంహెచ్ఓ మంజుల, ఎస్ఎఫ్ఏ గిరి పాల్గొన్నారు.

రూ.59 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: ఎన్ఆర్ఐ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. రూ.59 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ కాలనీ ఏర్పడి దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తుందని, కాలనీ వెంచర్ చేసే సమయంలో వేసిన రోడ్ల మరమ్మతులకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కాప్రా డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని చెప్పారు.

తాళాలు పగులగొట్టి చోరీ

అల్వాల్: ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. డీఐ తిమ్మప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలోని అంజనపురికాలనీలో నివసించే సుకాంత్ మూడ్రోజుల క్రితం భార్యను ఊరి నుంచి తీసుకురావడానికి మదనపల్లికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో దాచిన 26 తులాల బంగారు ఆభరణాలు, రెండున్నర తులాల వెండి నగలు, రూ.20 వేల నగదు దొంగతనానికి గురైనట్లు బాధితులు పోలీసులకు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



ఉప్పల్: వరుస పండుగుల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా నిరంతరం స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు ఉప్పల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి అన్నారు. ప్రతిరోజు అన్ని ప్రాంతాల్లో విధిగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.